# గంగి

ఎ. ఘూని



అప్పుడప్పుడే ముసురుకుంటున్న చిమ్మ చీకట్లను చీల్చుకుంటూ రైలు వచ్చి స్టేషన్లో ఆగింది ఆ స్టేషను ఒకమాదిరి స్టేషను. ఇద్దరు ముగ్గురు మాత్రమే దిగారు. ఎవరూ ఎక్కలేదు. స్టేషన్లో గంట మ్రోగుతూ వుండగానే రైలు కదిలి ముందుకు సాగింది.

ప్లాటుఫారంకు రెండోవయిపు రైలు దిగిన గంగి తుప్పల కడ్డుపడింది. చీకట్లో ఈత పొదలు, రాళ్లగుట్టలు, నీళ్లగుంటలు దాటుతూ వూరి వయిపుకు నడుస్తుంది. క్రొత్తవాళ్లెవరూ ఆ చీకట్లో ఆదారి గుండా నడవలేరు గంగికి మాత్రం ఆదారి కొట్టిన పిండే! లోగడ ఎన్నోసార్లు అంతకన్నా కటికచీకట్లో ఆదారినే వచ్చి తుప్పల్లో నక్కి కూర్చుని రైలురాగానే గార్డులకు, టిసీలకు కాపుసారాబుడ్లు అందించింది. ఆ దగ్గర్లోవున్న బస్తీలకు సారా సరఫరా అమ్మేపద్ధతుల్లో ఇదొకటి!

గంగి తాటితోపు దాటి జెండాచెట్టు దగ్గర కొచ్చింది. అప్పుడు అక్కడేదో గలాట జరుగుతుంది గంగి ముందుకు రాకుండా చాకలి వీరాయి గుడిశప్రక్క చీకట్లో నిలబడింది గవళ్ళ జరుగులు, చాకలి వీరాయి బాగా ఫూటుగా త్రాగి అడ్డమైన బూతులు తిట్టుకుంటున్నారు; పూరికే తూలిపోతున్నారు.

జరుగులు మరీ చిత్తుగా త్రాగినట్టున్నాడు జరుగులకు ఇప్పుడేకాదు ఎప్పుడూ ఇతే! ఎత్తినసీసా దించకుండా త్రాగులాడు వాడికి బాగా నిల్వవున్న సరుకు కావాలి...! 'ఆడికి వారంరోజులు భూంలో పాతెట్టిన సరుకు కావాలి. ఇయ్యాళ అట్టాంటిదే తాగినట్టున్నాడు. ఏడ తాగాడో? ఇంకేడ తాగుతాడు మావ గుడిశలోనే తాగుంటాడు. ఇంత ఘాటయిన సరుకు మాకాడ తప్పితే ఈ టగును పోలు మొత్తంమీద మరేడా దొరకదు. మరి గయితే ఈ జరుగులుగాడు ఈ తాగుడు యింకా మాన్లేదన్నమాట! అయినా తను పిచ్చికాపోతే మూన్నెల్లకే ఈ పాడలవాటు పోతుందా? వున్నకొద్దీ ఎక్కువేగాని తగ్గేది కాదుగా!'

గంగి ఆ గుడిశప్రక్క చీకట్లో నిలబడి ఇలా అనుకొంటుండగా యింతలోకి ఆ పేట్లోకి చిన్ననాయుడు పెద్దకొడుకు

నాగేశు వచ్చాడు. నాగేశుకూడా ముక్క మీద వున్నాడు.

జెండాచెట్టు దగ్గరికి నాగేశు రాగానే చీకట్లో నిలబడ్డ గంగి నెత్తిమీదకు పమిటచెంగు లాక్కుంది. నాగేశు వాళ్లిద్దరికి తీర్పేదో చెప్పుతున్నాడు.

ఈ వాయుడోళ్ళ నాగేశు తనంటె పడి సత్తాడు. గంగే, యిన్నట్టా సూత్తూ కాయ తాగుతుంటె కాయకు మూడు కాయల నిసా పుట్టుకొత్తదే, అని అనే వాడు. తానూరికే కులుకుతూ పాటుగా ఎన్నినీళ్ళు కలిపినా తెల్చుకోని సావడు. నాగేశే అన్నమాటేంది. తను సాగానికి సాగం నీళ్ళుకలిపి గలాసందిత్తే ఎంత మొగోడయినా డబల్ నిసాలో సిందులు తొక్కాల్సిందే. అందుకేగా తన మావ అమ్మకంలో తన్ను పెట్టింది...అని అనుకుంది గంగి!

ఆ త్రాగుబోతుల గొడవ అలా సాగుతూనే వుంది.

ఈ దారిన వెళ్లితే వీళ్లంతా తనను చూస్తారని గంగి మరో దారికి తిర్గింది. తన గుడిశకెళ్లాలి అంటె ఇది చుట్టు దారి అవుతుంది. వాళ్ల మధ్యనుండి వెళ్లటం యిష్టంలేక గంగి ఈ చుట్టు దార్నే పోయింది.

...గంగి ఆవూరొదిలి మూడు నెలలవుతుంది. ఒక కేసులో గంగికి ఆరు నెలల శిక్షపడి జైలుకెళ్లింది. ఈమధ్య నాగార్జునసాగర్ కాలువలకు నీరొదిలిన శుభసందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలమంది ఖైదీలను విడుదల జేసింది. అలా విడుదల చేయబడ్డ వాళ్లల్లో గంగి కూడ వుంది.

'ఆ సల్లని గంగమ్మతల్లి సలువ మూలకంగా ఆరునెల్లనుకుంది మూణెల్లకే బయటపడ్డా. మళ్లీ మా మావ కాడికి పోతుండా—'—అని రైలుఎక్కబోతూ అనుకుంది గంగి.

కబేళా వెనుకనుండి ఇటుకబట్టీలు దాటి కుమ్మరివాళ్ల యిళ్లమీదుగా గంగి తన మామవాళ్ల గుడిశల నయిపుకు వచ్చింది.

గవరయ్య (గంగి మామపేరు) గుడిశ లోంచి నవ్వులు వినిపిస్తోన్నాయి. 'అయితే యాపారం నాను లేక పోయినా మాజోరుగా పొగుతుందన్నమాట!' అని అనుకుంది గంగి. 'తన మావ సల్లగానే వున్నాడన్న మాట—'

గంగి కేదో తృప్తి, ఆనందంతో గుండెల్లోకి ఏదో చల్లగా జారినట్లనిపించింది.

గంగి లోపలి కెళ్లబోయి మళ్లీ ఆగింది. లోపల ఎవరున్నారో చూద్దామని కంతలోంచి లోపలికి తొంగి చూచింది.

మళ్లీ చూచింది—మళ్లీమళ్లీ చూచింది—చూస్తోన్న తనకళ్లను నమ్మలేక కళ్ళు నులుముకుని మళ్లీ చూచింది. ఎన్నిసార్లు చూచినా లోపల్నుంచి కనిపిస్తోన్న దృశ్య మొకటే!

కిర్సనాయిలు బుడ్డి మసక వెలుతురు. వాకిలి దగ్గరగా కుక్కి నులకమంచంలో చుట్టత్రాగుతూ నల్లమందు మత్తులో జోగుతూ అమ్మకాన్ని వోరకంట కని పెట్టుతున్న గవరయ్య. మార్పేమీ లేదు. గవరయ్య ఎప్పుడు అక్కడ అలాగే తిష్ట వేస్తాడు. నట్టింట కూర్చుని సీసాలు ఖాళీచేస్తున్న త్రాగుబోతులు. దాన్లోనూ మార్పేమీలేదు. పోతే తనుండవల్సిన స్థానంలోనే మార్పు వచ్చింది. తన చోటులో గ్లాసులు నింపుతూ, వెకిలి నవ్వులు చిమ్ముతూ, మాటిమాటికి డబ్బులు రొంటిన దోపుతూ ఒక పడుచు పిల్ల వుంది.

ఆ పడుచుపిల్లను చూచే గంగి తన కళ్లను తాను నమ్మలేకపోయినది. ఆ పడుచుపిల్ల ఏపుగా బలిసి వుంది. త్రాగుబోతుల కళ్లకు వుత్తచూపులతోనే కైపు ఎక్కించేటట్లుగా సింగారం చేసుకుని వుంది. వుత్తనీళ్లతోనే మత్తు కల్పించి చిత్తు చేసేటట్లు వగలు కురిపిస్తుంది.

ఆ ముగ్గురు త్రాగుబోతుల్లో ఒకడు ఎక్కిళ్లు పడుతూ కోరమీసాలను దువ్వుకుంటూ మడతపడ్డ నాలికతో అంటున్నాడు 'అరేయ్ గవరయ్యా, తలిసిగదరగా నీవహో మగాఢివి! ఆ గంగి పోతే పోయింది. దాన్ని మించిన సూపర్ని ఈ మంగిని తెచ్చావురా. దీని సేత్తో గాడిదుచ్చ యిచ్చినా దీనవ్వల్లి సిగదరగ మాంచి నిసాగా వుంటదశ—'

మంగితో సహా అందరూ పకపక నవ్వారు.

'మంగి!'—'అవును పాలెంలో తన పిన్నత్తకూతురు మంగి వుందని సెబుతుండేవాడు. అయితే దాన్ని తెచ్చిండన్న మాట! వూరికే యాపారం కోసరం తెచ్చి పెట్టిండా, మనువుకూడ సేసుకున్నాడా?'

గంగి గుండెల్లో ఏదో దిగబడ్డట్లని పించింది.

'మనువు సేసుకున్నాడా—మనువు సేసుకున్నాడా?' గుండెలు దడదడలాడుతున్నాయి.

'అట్టాయితే, మంగి ఇకీడే వుండిపోద్దా?'—ఒకడడిగాడు.

'అహో, ఎవడ్రా ఈడు—ఆడు ఐదొందలోసి దాన్ని మనువాడి తెత్తే— ఇకీడే వుంటదా అంటావేరా పీతమొగ మోడా?'

'మరి సిచ్చయినాక గంగి తిరిగొత్తే?'

'ఎవడశె ఈడు? జైలుకెళ్లింది యింకొత్తదా? ఏపోలీసోడో దాన్నె గరేసుకు పోతాడుగాని మళ్లీ బద్దరంగా పంపిత్తారా? ఒకేళ సేతులుమారొత్తే వచ్చిన దార్నే మళ్లీ పోతది. ఆకండీసనుమీదే మా అమ్మ ఈడికి నన్నిచ్చింది. ఏంవ్ మావ, మరి గంతేనా?' అంటూ మంగి గవరయ్యవంక చూచింది.

గవరయ్య ఏమీ మాటాడలేదు. నవ్వి వూరుకున్నాడు.

'ఏంఅంటాడు, సంపిత్తానంటాడా? ఎందుకంటుండు? నామావసంగతి నాకు తెల్దు? నేనంటె ఎంత పేణమో! నేనొత్తే యిక దీన్ని వుంచుతాడు?'—బయట చీకటిలో గంగి తనలో తాను—జారిపోతున్న గుండెలను ఎగబట్టుకుంటూ—అనుకుంది

లోపల కోరమీసాల తాగుబోతు విసుగ్గా, 'ఏంటశ, ఈ తుప్ప తుప్ప నీళ్లు. ఏది 'అండరుగవుండు'—రానీయ్ గవరయ్యా!' అన్నాడు

'ఒహో, ఏంటి ఎవ్వారం? రాత్రి ఏడవ్వా కన్నమేశావా?' అంది మంగి ఎక్కేస్తూ.

'కన్నమేసే కరమ నాకేంటే పిల్లా? నామూడు ముక్కలు వాసేతిలో వుంటె. ఆఁయ్, కాయ్‌రాజా, కాయ్! ముక్కయితే నీది, బొమ్మయితే నాది?'

మంగి కిసకిస నవ్వి మొగుడొంకతిర్గి, 'ఇంకా సూత్తావేం? సెత్తకుప్పలో పారేసిన సీసా పట్టా!' వుషారుగా అంది.

గవరయ్య కుక్కిమంచంలోంచి లేచాడు.




ఫోరింగ్ 50 షాట్ పిస్టల్

అటోమేటిక్ 50 షాట్లు పేల్చటాగలదు శక్తివంతమైనది. ఇందు నుండి వెలువడు చిచ్చు రవ్వలు మిమ్ము కాపాడును. ధర 50




షాట్ల నెం.33 రు 13/50. జర్మన్ మోడల్ నెం 99 రు. 15/50 వి.పి.పి. చార్జీలు రు. 2/50 లెదర్ కేస్ రు 7/- అదనపుషాట్లు 100కి రు 5/-

GEM ARTS (WAPM-15)
P. Box 1325, Delhi-6

వాయిదాల మీద ట్రాన్సిస్టర్లు

నెలకు రు. 30/-ల వాయిదా చెల్లుబడిమీద 'నేషనల్' పోర్టబుల్ 3 బ్యాండ్లు ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టరు పగులనట్టి ప్లాస్టిక్ కాబినెట్‌లో పొందండి. వ్రాయండి.



JAGSON AGENCIES (WAPM-88)
P. B. 1212, Delhi-6


# గంగి

పోట్లో మట్టువతల పారేసి కాండ్రించి వుమ్మేసి బయటికెళ్ళాడు.

గవరయ్య అటు గుమ్మం దాటగానే కోరమీసాలవాడు మంగి జబ్బపట్టుకుని మీదకు లాక్కున్నాడు.

'ఓలమ్మో!, ఆగవే, ఆడొత్తాడు—' అంది మంగి యింకా మీాదకు వదుతూ.

గోడవారగ నిలబడ్డ గంగి ఇది చూచి, థుపుక్కున వుమ్మేసి, 'ఛీ, ని జల్మం ముండా!' అని అనుకుంది.

పెంటకుప్ప వయిపు నడిచింది.

సారా సీసాలను భూమిలో పాతిపెట్టి వారం పదిరోజులుంచుతే సరుకు మాంచి ఘాటుగా నిషాగా వుంటుంది. ఇలా నిల్వ వున్న సారా ఒక గ్లాసుడు త్రాగితే చాలు, మామూలు సారా రెండు సీసాలు తాగిన దానికంటె ఎక్కువ 'పవర్'గా వుంటుంది. దీని వెల జాస్తి. ఇలా భూమిలో నిల్వ వుంచిన సరుకును 'అండర్ గ్రౌండ్' సరుకు అంటారు. గవరయ్య 'అండర్ గ్రౌండ్', 'గోదామూ' ఈ పెంటకుప్పే! పైకి చూపులకు వుత్త పెంటకుప్ప లోపల ఎన్నో సీసాలుంటాయి. ఈ చెత్త కుప్ప ఎంత ఖరీదో చేస్తుంది! ఎంతో నిషానిస్తుంది. ఈ పెంటకుప్ప కావు సారా వ్యాపారస్థులకు పోలీసులకు, ప్రొహిబిషన్ అధికారులకు నిధి – కనకవర్షం కురిపించే కామధేనువు! త్రాగుబోతులకు అమృతం నిండిన దేవసరస్సు!

గవరయ్య గొంతుకూర్చుని నేల త్రవ్వుతున్నాడు. తన వెనకాల అలికిడి అవగానే కంగారుగా, 'ఎవరా మడిసి' అంటూ వెనక్కి తిరిగాడు.

చీకట్లో నెత్తిన చెంగేసుకుని నిలబడ్డ గంగి. గవరయ్య గంగిని గుర్తుపట్టలేదు.

మళ్ళీ, 'ఎవరది?' అన్నాడు.

గంగి మాటాడలేదు.

గవరయ్య లేచి దగ్గరకొస్తూ 'ఎవరంటె మాటాడరేం? నోర్లేదా?' అన్నాడు.

ఈసారి గంగి మెల్లగా, 'నేను మావ — నీ గంగిని!' అంది.

గవరయ్య ఆశ్చర్యంలొంచి తేరుకుంటు న్నట్లు ఒక్క క్షణంసేపు ఏవీా మాటాడ లేదు.

'ఎట్టా, అప్పుడే సిచ్చయిపోయిందా?' అన్నాడు.

'వదిలేశారు'

'ఓహో, అదా? మరి వూరెందు కొచ్చావ్?'

'ఇక మరేడికెళ్తా?'

గవరయ్య వెటకారంగా నవ్వాడు. ఆనవ్వు వండబాడిశలయి గంగి గుండెల్లో దిగేసి నట్లనిపించింది.

'ఏంటిమావ, నగుతున్నావ్? నిన్నొదిలి నేనేడికిపోతా? నీవులేకుండా నేనెట్టా వుంటా?' అని అంటూ వస్తోన్న ఏడ్పును ఆపుకోవటానికి వ్యర్థప్రయత్నంచేస్తూ, నిస్సత్తువతో నిలబడలేక కింద కూలబడి గవరయ్య కాళ్ళు పట్టుకుంది.

గవరయ్య, కాళ్లను చుట్టుకున్న గంగిని విదిలించి కొట్టాడు. గంగి వెనక్కి వెళ్లి కిందలా పడబోయి అరచేతులతో నేలను పట్టుకుని ఆపుకుంది.

'గంగే, వయిస్లో వున్నాడది జైలుకెళ్ళి మూడ్నెళ్ళుండొచ్చిందంటె ఇకది కుక్క ముట్టుకున్న కుండన్నమాటేగదే?'

గంగి గిలగిల లాడిపోయింది.

'మావ, నాసంగతి నీకుతెల్దా?'

'పోలీసోళ్ల సంగతికూడ తెల్సే! తెల్లారి లేత్తె ఆళ్లతోనే గందే మన ఎవ్వారమంతా! ఆళ్లేలాంటోళ్లో, అందమయిన ఆడది ఆళ్లసేతికి సిక్కితే వాళ్లేంసేత్తారో నాకు తెల్దంటే!'

మింగుడుపడని ఏడ్పుతో 'మావా!' అని అంటూ గంగి మళ్లీ గవరయ్య కాళ్లను చుట్టుకుంది. గవరయ్య ఆవేశంగా గంగిని కాళ్లతో విదిలించి కొట్టి, 'పోయే, నీదారి నీవు సూస్కో. నేను మాసిన్నత్త కూతురు మంగిని మనువు కూడ సేసుకున్నా—' అని పెద్దపెద్ద అంగలేసుకుంటూ తన గుడిశలోకి వెళ్ళి పోయాడు.

గంగి కూర్చున్నచోటే కూలబడి మోకాళ్లమీాద తలపెట్టుకుని కుళ్ళికుళ్ళి ఏడ్చింది.

కాసేపటికి ఎలాగో ఏడ్పును దిగమింగుకుంది. ఇక తనకక్కడ స్థానం లేదు. తనిక అక్కడ వుండటం మనవపర మనుకుంది!

మెల్లగా లేచి నిలబడింది. తన మాంవ గుడిశ వయిపొకసారి చూచింది. లోప ల్నుంచి వెకిలినవ్వులు వినిపిస్తున్నాయి. దూరంగా వూరకుక్కలు మొరుగు తున్నాయి.

ఆ చీకట్లో చీకట్లు ముసిరిన మన సుతో ముక్కలూ చెక్కలూ అయిన హృదయంతో 'గంపెడు చీకటి నెత్తినేసు కుని' ముందుకు నడిచింది. ఎటు పోతుందో తెలియదు. ఎటుపోవాలో తెలి యదు. అడుగులు ముందుకు పడు తున్నాయి. గుడిశలు వెనక్కిపోతున్నాయి.

తాను కుక్క ముట్టినకుండా? అయితే జైలుకెళ్లిన ప్రతి ఆడది అంతేనా? అసలు తాను జైలుకెందు కెళ్లింది? ఎవరికోసర మెళ్లింది? ఏం నేరంచేసిం దని శిక్షపడింది?

కచేరిలో కొట్టిన తొమ్మిది గంటలు గాలివాలులో టంగున మ్రోగుతున్నాయి.

* * *

నాలుగు నెలల క్రితం—

ఆ రాత్రికూడ ఇలాగే చీకటిగా వుంది. అప్పుడుకూడ ఇలాగే కచేరిలో తొమ్మిది గంటలు మ్రోగాయి.

ఈ రోజు మంగి వున్న స్థానంలో ఆనాడు గంగి వుంది. ఖాతాదార్లకు ఇలాగే గ్లాసులు అందిస్తూ, వాళ్లు యిచ్చే డబ్బులు రొంటిన దోపుకుంటుంది. ఆరోజెందుకనో అమ్మకం మందంగా వుంది. గవరయ్యకు నల్లమందు వుండ తీసి యిచ్చింది. గవరయ్య నల్లమందేసుకుని, 'నీవింకా కూడుతినలేహే — ఇప్పుడెవడూ రాడుగానీ!' అన్నాడు. గంగి అన్నం పెట్టు కోవటానికి లోపలికెళ్లుతుండగా, ముత్తడు మరియిద్దరూ ఆదరాబాదరాగా వచ్చారు.

రావటంతోనే 'అండర్ గ్రౌండ్' లెమ్మ న్నారు. గంగి చెత్తకుప్పల్లోంచి సీసాలు తెచ్చేలోపల వాళ్లు ఏదోవిషయం మెల్ల గుసగుసలాడుకుంటున్నారు. గంగి వాళ్లకు గ్లాసులు నింపి యిస్తూనే వాళ్ల తర్జన భర్జన ఒకచెవితో వింటూనే వుంది.

ఆలా విని గంగి తెల్సుకున్న విషయ మేమిటంటే—

వాళ్లముగ్గురూ కలిసి ఒక అయిదేళ్ల పాపను ఎత్తుకొచ్చారు. ఆపాప వాళ్ల పెద్ద వాళ్లతో సినిమా కొచ్చింది. సినిమా జరుగుతుండగా మధ్యలో ఆ పాపకు దాహం వేసి సోడా త్రాగటానికి గేటుదగ్గర కొచ్చింది. ముత్తడి సోడాబండి దగ్గర సోడా కొట్టించుకుని త్రాగింది. సోడా త్రాగుతున్న ఆపాప వంటిమీదున్న నగలు చూడగానే ముత్తడికి కళ్లు కుట్టాయి; దుర్బుద్ధి పుట్టింది. అప్పుడు సినిమాహాలు ఎదురుగుండా పురిజూదమాడుతున్న ఈ యిద్దరికి సైగచేశాడు. ఆ పాప సోడా త్రాగి పెనలాకాసు యిచ్చింది. ఆ ప్రక్క నున్న కొట్టుదగ్గర చిల్లరమార్చి యిస్తాను రమ్మనని ఆపాపను ప్రక్కకి తీసికెళ్లాడు. పాపం; ఆపాప వీడి వెనుకే వెళ్లింది. సినిమాహాలు వెనుకవున్న పార్కు ప్రక్కకి తీసికెళ్లాడు, ఆపాపకు మత్తు మందు వాసన చూపించి, మిగతా యిద్దరి సాయంతో రిక్షాలో గవరయ్య సారా కొట్టుకు తీసికొచ్చారు. ఇప్పుడా పాపను గవరయ్య గొడ్లపాకలో గడ్డిగాట్లో పండుకో బెట్టి చుక్కేసుకుంటానికి లోపలి కొచ్చారు.

ఆ పాప అప్పుడు తమ గొడ్లపాకలో గడ్డిగాట్లో పడివుందని వినగానే గంగి కాలుకాలిన పిల్లి అయింది. ఏమి చేయ టానికి కాలూ చేయీ ఆడలేదు. వాళ్లకు యింకోసారి గ్లాసులు నింపి, ఏదో పని వున్నట్లు మెల్లగా బయటి కెళ్లింది. పాకలోకి వెళ్లి చూచింది. ఆ పాప. ఏ తల్లికన్న పిల్లోగాని పచ్చగా బొద్దుగా ముద్దుగా వుంది. పాపం వాళ్ళమ్మ వడిలో నిద్రపోతున్నట్లుగానే ఆ చీకట్లో ఆ గడ్డి గాట్లో పడివుంది. ముద్దులు మూట కట్టే ఆ పాపను ఆ స్థితిలో చూడగానే గంగి కడుపు చెరువయి కళ్లు చెమ్మ గిల్లాయి... అప్పటికి మూడునెలలు క్రితం తను కన్న పసిగుడ్డు పుట్టిన మూడో నాటికే పొత్తిళ్లలోనే కన్నుమూసిన దృశ్యం కళ్లముందు మెదిలింది. కడుపు కోత మళ్లీ రేగింది. మూడునెలల క్రితం తన కడుపులో ఖాళీ అయిన అరలో, మాయపొరల అడుగున తల్లిప్రేమ వుబికింది. ఇంకా పాలధార ఆరని పచ్చి రొమ్ముల్లో పాలనరం కలుక్కుమంది,

......'ఆ పిల్ల నిన్నే గురుతుపట్టి పోలీ సోళ్లకు పట్టిత్తదని భయంగా వుంటె ఆపని నీ సేతుల్తోనే సేయ్—'


'ఓ, అవల్ రయిటుగా. దదుత్తారా? అది నర్సిగా, మన సేతుల్లో పెద్ద పెద్ద పేణాలే గల్లంతయ్యాయి. ఇక ఈ పసి గుడ్డొక లెక్కా? మరిగయితే, ఆ మెళ్లో గొలుసు సేతి గాజులు వాయి, సెవు లోలుకులు, వుంగరాలు మీయి—'

'సర్లేరా, ఆట్టాగే తీసికో, కట్టమంతా నీదే—'

నగలు అక్కడికక్కడే పంచుకున్నారు.

'ఇంకో అరేసుకుని మేం పోతాం, నీపని నీవు, సూస్కో—'

'ఈ గంగేది—' అని అంటుండగా



గంగి బయట్నుంచి లోపలి కొచ్చింది. లోపలికొస్తూ వీళ్ళనుకున్న మాటలన్నీ విన్నది.

'ఓబుల్లి, యింకో రెండురూపాయలు తే–' అన్నాడు ముత్తడు.

గంగి యిచ్చింది. ముత్తడు ఒక సీసా వాళ్ళిద్దరికిచ్చి, రెండో సీసాను పైకెత్తుకుని గట గట త్రాగాడు.

నర్సిగాడి ప్రక్కన చక్కగా సక్కలాగా వున్న వాడు బీడి వెలిగిస్తూ, 'పిల్ల బొందను రైలుపట్టాలి మీద పండ పెట్టితే పైఛలా!' అన్నాడు.

ముత్తడు వెకిలిగా ఛీత్కారం చేస్తూ, 'ఎవడ్రా ఈ కుర్ర నాయాలూ? ఈరైలు కోసరం ఎన్ని జాంలు పడిగాపులు కాయాలి? ఈలోపల పిల్లదానికి మళ్ళీ తెలివొత్తే–'

'మరేం సేత్తావ్?' నర్శిగాడు అడిగాడు.

ముత్తడు, 'ఏం సేతానా? హాలికిలు అవకడ వున్న తుప్పల్లో పీకపిసికి పారనూకితే, ఎవడహే సూడొచ్చేది?' అన్నాడు

'ఎట్టగో సేయ్–మమ్మల్ని మాత్తరం బయటికి లాగ మాక. మేం పోతుండాము'ని చెప్పి వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

ముత్తడు చిత్తుగా త్రాగుతున్నాడు. లేచి నిలబడితే చాలు కింద పడేటట్లు వున్నాడు. మనిషి 'కంట్రోల్' తప్పుతున్నాడు.

గంగి మెల్లగా చెంబు తీసికుని గవరయ్యతో, 'నేను పెమ్మటికి పోతుండా ఈడికాడ పదిరూపాయలు తీస్కో–'అని చెప్పి బయటికెళ్ళి పోయింది.

గవరయ్య కప్పటికే నల్లమందు మత్తు మూరన్నరకి పైగా ఎక్కింది. 'సరే ఎల్లు–అప్ప మాతరం పేయమాకు–ఆఁ–' అని అన్నాడు.

—ముత్తడు పసిపిల్లను భుజానేసుకుని తూలుతూ తూలుతూ 'హాలికల' వయిపు పోయాడు. కాసేపటికి 'హాలికల' ప్రక్క వున్న తుప్పల దగ్గరికి జేరాడు. అంతా కటిక చీకటిగా వుంది. ఆకాశంలో మబ్బు తెరలు మాటునుండి తారలు కింద జరుగుతున్న ఈ ఘోరకలిని తొంగి చూస్తున్నాయి. ముత్తడు ఆ పాపను ఒక తుప్ప ప్రక్క పండుకోబెట్టాడు. ఆయాసంతో రొప్పుతూ అక్కడ కూలబడ్డాడు. 'నీయమ్మ, ఈ పిల్లముండ సాలబరువుందశే!' అని గొణుక్కుంటూ ఆ పిల్లమెడ నులమటానికి మెడపుచ్చుకున్నాడు.

ఇంతలో వెనుక నుండి వాడి నెత్తిన ఒక పెద్దరాయి పడింది.

'సచ్చాన్రో' అంటూ ముత్తడు కింద పడ్డాడు.


వాడు కిందపడగానే గంగి ముందుకొచ్చింది. పిల్లను భుజానేసుకుని వూరి వయిపు పరుగెత్తింది. అలా ఆ పిల్లను భుజనేసుకుని వెళ్ళతుంటె ఆనాడు పొత్తిళ్ళల్లో కన్నుమూసిన తన పసిగుడ్డు బ్రతికినట్లనిపించింది. మాతృ భావం మనస్సునిండా నిండింది.

ముత్తడు వాళ్ళు ఆ పిల్లను 'కంచుకోట' ఆడుతున్న హాలుదగ్గర ఎత్తుకు వచ్చారు. ఆ పాప తల్లిదండ్రులు యిప్పుడు అక్కడే వెతుకుతూ వుండవచ్చు అక్కడికి తీసికెళ్ళి వాళ్ళ కప్పగించాలని గంగి తొందర తొందరగా వెళుతుంది. మళ్ళీ ముత్తడు లేచి వెనకాల పరుగెత్తుకు వస్తాడేమోనవే ఆలోచన రాగానే నడక జోరు చేసింది.

అడ్డదారుల గుండా సందుల్లో గొందుల్లో నడ్చి చిన్నబజారు కొచ్చేసరికి కచేరిలో పన్నెండు గంటలు మ్రోగుతున్నాయి. ఒక సందుచివర క్రీనీడలో నిల్చుని పమిటి చెంగుతో చెమట తుడ్చుకుంది. అప్పుడు అటువయిపాక రిక్షా వెళుతుంది. పిల్లను మోయటానికి రొప్పుగా వుంది. రిక్షాలో సినిమాహాలు దగ్గర కెళ్ళదామని రిక్షాను పిల్చింది.

రిక్షా బేరమాడి లోపలి కెక్కుతుండగా వెనుకగా తన భుజంమీద ఒక బలమైన చేయిపడింది.

గంగి భయంతో వెనక్కి తిర్గింది. పోలీసు కానిస్టేబుల్!




ఆ పాప తండ్రి ఆ వూళ్ళో పెద్ద ప్రభుత్వ వుద్యోగి. పిల్ల కనిపించకపోయే సరికి అన్ని పోలీసుస్టేషనులకు రిపోర్టులు వెళ్ళాయి. రాత్రి పదిగంటలనుండి పోలీసులు వూరంతా గాలిస్తున్నారు. ఆ కానిస్టేబులుకు గంగి పిల్ల నెత్తుకుని కనిపించింది. ఆ రిక్షాలోనే జైలుకు తీసి కెళ్ళాడు. పిల్లను ఆ ఆఫీసరుకప్పగించారు. గంగిని లాకప్‌లో పెట్టారు.

ఆ తర్వాత జరిగిందేమిటంటే—

నిరపరాధిని అయిన గంగికి శిక్ష పడిం—. గంగి చెప్పింది ఎవరూ వినిపించుకోలేదు. ముత్తడి తలమీద రాయితో కొట్టాను. వాడక్కడ చచ్చిపడివుంటాడు చూడమన్నది. చూస్తే వాడక్కడ లేదు. అసలు వాడి జాడేలేదు. దొంగసారా అమ్ముకునేది ఒక పిల్లను దుండగుల బారి నుండి రక్షించటమేమిటి, అప్పగించబోవటమేమిటి — ఇదంతా కట్టుకథ పొమ్మన్నారు. గవరయ్య ఏదో ప్రయత్నం చేశాడు. కాని, లాభంలేక పోయింది. 'ఇదొక పెద్దాఫీసరు కూతురు కేసు. మన చేతుల్లో ఏమీ లేదు.' అన్నారు పోలీసు పార్ట్నర్స్! అవును మరి ఒక పెద్ద ఆఫీసరు కూతురును ఎవరో దుర్మార్గులు ఎత్తుకుని పోతే ఎవరో ఒకర్ని వెంటనే అరెస్టు చేయకుండా; శిక్ష వేయకుండా ఎలా వుంటారు? సమయానికి గంగి దొరికింది. అరెస్టు చేశారు. ఆర్నెల్లు శిక్ష వేశారు.

* * *

"ఓరి భగవంతుడా, ఏడున్నావురా తండ్రీ! నా బతుకెట్టా సేశావురా? ఎన్ని అగసాట్లొచ్చి పడ్డాయిరా—'అని అనుకుంది—చీకట్లో గమ్యంలేకుండా నడిచిపోతున్న గంగి!

జైల్లో లాఠీ దెబ్బలు తినయినా తన శీలాన్ని కాపాడుకుంది; అంతేగాని తన మామకు ద్రోహం తలబెట్టలేదు. ఏమామ కోసమయితే లాఠీ దెబ్బలు తిన్నదో ఆ మామ ఈనాడు తనను 'కుక్క ముట్టిన కుండ' అన్నాడు; 'నీ దారి నీవు సూస్కో' అన్నాడు.

ఇక తన గతేమిటి? ఏం జేయాలి? ఇకే వూళ్ళో వుండలేదు. ఈ లోకంలోనూ వుండలేదు. ఏమయినా ముందొకసారి ఏపసి పిల్ల ప్రాణాలను కాపాడటంకోసం తానీ స్థితికొచ్చిందో ఆ పిల్లను తన కళ్ళతో చూడాలనుకుంది. ఆ పిల్ల తండ్రి పేరు మధుసూధనరావుగారని జైలులో వుండగా

ఒకసారి విన్నది. ఒక రిక్షా ఎక్కి ఎలాగో ఆయన యిల్లు కనుక్కొని ఆ యింటి కెళ్ళింది. ఆ యింటి యివతలగా రిక్షా దిగింది.

ఆ యింటి వరండాలో అప్పుడా పాప గుర్రం ఎక్కి ఆడుకుంటుంది. వాళ్ళమ్మ పాపను అన్నం తినిపిస్తోంది. గంగి గేటు దగ్గర చీకట్లో నిలబడి ఈ దృశ్యం చూచింది. గంగి మనస్సు అవ్యక్తమైన ఆనందంతో నిండిపోయింది. ఆ నాడు తాని సాహసం చేయకబోతే ఈ పాప యిప్పు డిక్కడ యిలా ఆడుకొంటూవుండేదా, అని అనుకుంది. ఇంతలో ఆ పాపతల్లి మంచి నీళ్ళు తీసికొనిరావటానికో, మరి దేనికో లోపలి కెళ్ళింది.

గంగి గేటుదాటి లోపలికి వచ్చింది.

'పాప, బాగున్నావమ్మా' అని ప్రేమగా అడిగింది. గంగికి ఒక్కసారి ఆ పాపనెత్తుకుని ముద్దు పెట్టుకోవాలనిపించింది.

ఆ పాప గంగిని చూచి భయపడింది. 'అమ్మా, బూచి బూచి—' అని కేకలు వేసింది. ఆ కేకలు విని వాళ్ళమ్మ కంగారుగా బయటికి వచ్చింది. పాప, తల్లిచంక ఎక్కి తల్లిని గట్టిగా కౌగిలించుకుంది, 'అమ్మా, చూడు పిచ్చిది!' అని గంగిని చూపించింది.

ఆమె కూతుర్ని గట్టిగా గుండెల కదుముకుంటూ గంగ వంక కోపంగా చూచి, 'ఏమ్ - నీవ్వే పో అతవలికి' అంది.

'పోతుండానమ్మా — పోతుండా—' అని లోలోపల గొణుక్కుంటూ గంగి వెనక్కి తిరిగింది.

'దొంగముండ, ఏదన్నా చేతికందితే పట్టుకు పోదామని వచ్చింది. మా అమ్మా, దడుచుకున్నావా తల్లి?'

గంగి రోడ్డు దాటింది ఎదురుగుండా కాలువ కనిపించింది. వీధి దీపం కాంతిలో కాలువలోని నీళ్ళు మిలమిల మెరుస్తున్నాయి కాలువను చూడగానే గంగికి తన గమ్యమేమిటో తెల్సింది.

రెండు చేతులెత్తి; 'గంగమ్మ తల్లో!' అని దణ్ణం పెట్టింది.

'ఆ పాపోళ్ళమ్మ పాపను గుండెల కదుముకుని దాసుకుంది. నన్ను నీవు దాస్కో తల్లి!' అని మనస్సులో అనుకుంటూ కాలువ గట్టెక్కింది. ●

ASP TIL T 29 TEL




పుష్టికరమైన తుషార్ మీ యింట్లో వంటలకు చాలా మంచిది. ఎ. డి విటమిన్‌లు కలిగివున్న తుషార్ వంటకాలను రుచికరం చేయడమే. తుషార్‌తో వండిన వంటకాలు రుచికరంగా వుండడమేగాక మీ వంటికి చాలా మంచిది.

తుంగభద్ర ఇండస్ట్రీస్ లి॥ కర్నూలు.

తుషార్‌తో వండిన వంటకాలు అత్యంత రుచికరం.

